వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ నేతృత్వంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ షరాఫ్ బజార్లో ఆర్యవైశ్య ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యంగా షరాఫ్ బజార్లోని పాత వైశ్య బ్యాంకు కూడలిలో స్థానికులు తమ వాహనాలు నిలుపుకునేందుకు అవకాశం లేని పరిస్థితి ఉందని, బయట వాహనాలు పార్కింగ్ చేయటంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనికి వెంటనే ఎమ్మెల్యే స్పందిస్తూ, ట్రాఫిక్ ఎస్ఐ జోగి శ్రీనివాసరావుకు ఆదేశాలు జారీ చేశారు. స్థానికుల వాహనాలు మినహా, బయట వాహనాలు పెట్టకుండా ట్రాఫిక్ బోర్డు పెట్టాలని చెప్పారు. దానికి కూడా వాహనదారులు పాటించకపోతే వాహనాలు సీజ్ చేసి పోలీస్ స్టేషన్లో పెట్టాలని ఎస్ఐని ఆదేశించారు. వలంటీర్ల పనితీరు ఎలా ఉంది? ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందిస్తున్నారా? అర్హత ఉండి రాని వాళ్ళు ఎవరైనా ఉన్నారా? వలంటీర్ అందరికీ అందుబాటులో ఉండి పనిచేస్తున్నారా? అన్న అంశాలను ఎమ్మెల్యే శివకుమార్ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మీయ సమావేశంలో నాళం రజిని కుమార్, పీవీఎస్ భాస్కర్, పి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చినరావూరు పార్కులో విద్యుత్ శోభకు సామగ్రి వితరణ


విద్యుత్ బల్బులు, పరికరాలను అందజేస్తున్న కొత్తమాసు కుమార్

తెనాలి: పట్టణ చినరావూరులోని మున్సిపల్ లేక్వ్యూ పార్కుకు స్థానిక నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, చంపకవల్లి దంపతులు రూ.2 లక్షల విలువైన విద్యుద్దీపాలు, పరికరాలను అందజేశారు. విద్యుత్ బల్బులు పనిచేయక, వాకర్స్ పడుతున్న ఇబ్బందులను స్థానిక వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు, నటరాజ్ జ్యూయలర్స్ దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించిన సంస్థ యాజమాన్యం వితరణకు ముందుకొచ్చింది. పార్కు ఆవరణలో ఆదివారం పట్టణ ప్రముఖులు, వాకర్స్ సమక్షంలో ఆయా సామగ్రిని కొత్తమాసు కుమార్ అందజేశారు. పార్కులో ఫ్లడ్ లైట్లు, విద్యుత్ పరికరాలు, కేబుల్స్ దెబ్బతినటంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేస్తుండే స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను చెప్పగానే స్పందించి సాయం చేసిన కొత్తమాసు కుమార్కు గుంటూరు కోటేశ్వరరావు, వాకర్స్ ధన్యవాదాలు తెలియజేశారు. అవసరమైన సామగ్రిని అందించటంతో పార్కుకు విద్యుత్ శోభ సమకూరుతుందనీ, భవిష్యత్లో పార్కు అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని కుమార్ ప్రకటించారు. మామిళ్ల జగదీష్, మేడేపల్లి ప్రభాకర్, మామిడాల సుమన్, సురపుల వెంకట్రావు, పెరుగు మల్లికార్జునరావు, కొణిజేటి శ్రీనివాసరావు, అడపాల ఏడుకొండలు, సుధాకర్, అల్లంపల్లి ప్రసాద్, చందూరు అరుణకుమార్, నాంచారమ్మ, మున్నంగి సత్యం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేదలకు దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: శ్రీ అంజనేయం ధ్యాన యోగా మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు సెంటర్లలో పేదలకు దుస్తులు పంపిణీ చేసి అల్పాహారం అందజేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మారీసుపేటలోని అప్పలస్వామి గుడి వద్ద తులసి ఆకుల చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని కిషోర్ గురూజీ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రాన్ని కడిదం కోటేశ్వరరావు, శివరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, పురుషోత్తమ కృష్ణ, చెంచయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, సుబ్బారావు, సుజాత, భూపతి, ప్రసాద్, శాంతి, గుప్తా, కోమల, యోగా మండలి సభ్యులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్లో వివేక విద్యార్థుల ప్రతిభ



తెనాలి: జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో స్థానిక వివేక విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించినట్టు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. రెండు విడతలుగా విడుదలైన పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థి ఆర్.భార్గవసాయి తొలి విడతలోనే 99.4 పర్సంటైల్ సాధించగా, ఇప్పుడు డోగిపర్తి సాయి మణికంఠ 95.2, ఎ.యామిని 91.698, ఎస్జీవీడీ దివ్యమాధురి 90.29 పర్సంటైల్తో టాపర్లుగా నిలిచినట్టు తెలిపారు. వీరిని వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు సత్కరించారు. ఒత్తిడి లేని విద్యావిధానంలో ప్రణాళికాబద్ధంగా చదవటంతోనే తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేవీ బ్రహ్మం, నర్రా శ్రీనివాస్, మురళి పాల్గొన్నారు.

వేమవరంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని గోవిందమాంబసమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామికి విశేష అర్చనలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు వేద పండితులు అయ్యన్నశాస్త్రి, రోహిత్శాస్త్రి, కార్తిక్శాస్త్రి నిర్వహించారు. ఆరాధన జెండాకు పూజలు చేసి అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రామచంద్రాపురంలో..

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామి ఆరాధనా మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు భీమిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో స్వామికి పంచామృత, హరిద్ర, గంధ, విభూతి, వివిధ రకాల ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నృసింహుని ఆలయం వద్ద అల్పాహారం పంపిణీ

మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద వద్దుజ్యోతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు, వృద్ధులకు, దివ్యాంగులకు, భక్తులకు అల్పాహారం, రాగిజావ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది వేమూరి రత్నప్రసాద్, ఉమారాణి దంపతులు అల్పాహారం పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకులు జి.వెంకట పూర్ణచంద్రరావు, న్యాయవాది టి.నరసింహారావు, బాలకృష్ణ, హేమచంద్ర గుప్తా, బి.ప్రసాద్, కె.శ్రీనివాస్, జి.సుందరరావు, జి.మురహరిరావు, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

కదిలిన ల్యాప్టాప్ చోరీ కేసు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న ప్రైవేట్ హాస్టల్ రూమ్స్లో చోరీకి గురైన ల్యాప్టాప్ కేసులో పోలీసులకు చిన్న క్లూ దొరకడంతో దాని ఆధారంగా ల్యాప్టాప్ దొంగల డొంకను కదలించారు. వివరాలు.. తాడేపల్లి పోలీస్స్టేషన్ పరిధిలో ల్యాప్టాప్లు దొంగతనాలకు గురయ్యాయంటూ ఫిర్యాదులు అందాయి. విచారణలో భాగంగా వాటర్ప్లాంట్లో పని చేస్తున్న ఓ యువకుడు ల్యాప్టాప్లు అమ్ముతున్నాడని సమాచారం రావడంతో ఆదివారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 4 ల్యాప్టాప్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని, ఆ వ్యక్తి విచారిస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తున్నామని చెబుతున్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం


గాంధీచౌక్లో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కఠెవరంలో స్వామివారి ప్రభ ఊరేగింపులో పాల్గొన్న కమిటీ సభ్యులు

తెనాలిటౌన్: పట్టణ గాంధీచౌక్లోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆరాధనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో భక్తులు విశేష పూజలు జరిపారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. పట్టణవిశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి, గుంటముక్కల అర్జున్, కడియం శేషుబాబు, తుమపాల లక్ష్మీప్రసాద్, పట్నాల లక్ష్మణ్, నరేంద్ర, నాగేశ్వరరావు, ఇంకొల్లు శ్రీను, రవి, వేమూరి సాయి, భక్తులు పాల్గొన్నారు. కఠెవరం గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి 78వ ఆరాధన మహోత్సవం వైభవంగా ప్రారంభించారు. గ్రామ పురవీధులలో స్వామి వారిని ఊరేగింపు నిర్వహించారు. ఆత్మానంద సేవా సమాజం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూసపాటి శ్రీనివాసరాజు, వెంకమ్మరాజు, సాంబశివరాజు, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, కృష్ణంరాజు, మంచాల సురేష్, నాగరాజు, నరసరాజు, సభ్యులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ

మంగళగిరి: నగర పరిధి యర్రబాలెం శివాలయం సెంటర్లో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి చలివేంద్రంలో ఆదివారం దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత గొల్లపూడి మోహనరావు జ్ఞాపకార్థం కుమారుడు, నగర పాలక సంస్థ వర్క్ ఇన్స్పెక్టర్ గొల్లపూడి గోపిరాజు, దివంగత రేమిడిశెట్టి వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు, ఇస్రో ఉద్యోగి రేమిడిశెట్టి కోటేశ్వరరావు బాటసారులు, వాహనదారులకు 200 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భీమవరపు వెంకట్రావు, లేళ్ల నరసింహారావు, మక్కే కిరణ్, గంధం సురేష్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్పై యువకుడి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని కొలనుకొండ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువకుడు ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. వడ్డేశ్వరానికి చెందిన మర్రి సూరిబాబు, మహాలక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడు కిరణ్కుమార్(24) ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. విజయవాడలో చిన్న ఉద్యోగం చేస్తూ హైదరాబాద్లో ఉద్యోగం రావడంతో ఆదివారం సాయంత్రం హైదరాబాద్ ప్రయాణం కావాల్సి ఉంది. శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటికి రావడంతో తల్లి మందలించింది. మనస్తాపానికి గురై ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిన కిరణ్ కుమార్ చెన్నై విజయవాడ రైల్వే ట్రాక్పై తలపెట్టి పడుకోవడంతో రైలు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. కిరణ్కుమార్ మొండెం, తల వేరువేరు అయ్యాయి. రైల్వే సిబ్బంది కిరణ్జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఘటనపై తెనాలి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పినపాడు మహాప్రస్థానంలో మార్చురీ రూం నిర్మాణం

రూ.4.50 లక్షల విరాళమిచ్చిన ఎన్నారై వీరమాసునేని శ్రీనివాస్


కార్యదర్శి శివరామకృష్ణప్రసాద్కు చెక్కు అందజేస్తున్న వీరమాసునేని శ్రీనివాస్

తెనాలి: పినపాడులోని మహాప్రస్థానంలో మార్చురీ రూంను నిర్మించనున్నారు. మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో మార్చురీ రూమ్ నిర్మాణానికి ప్రవాస భారతీయుడు ఆదివారం రూ.4.50 లక్షల చెక్కును సమితి నిర్వాహకులకు అందజేశారు. ఇటీవల మృతిచెందిన జిల్లా పరిషత్ విశ్రాంత సీఈవో వీడీఆర్ మనోహర్ జ్ఞాపకార్థం ఆయన తనయుడు అమెరికాలోని జిప్సమ్ కార్పొరేషన్ చీఫ్ కంట్రోలర్ ఇంజినీర్ వీరమాసునేని శ్రీనివాస్ అవసరమైన మొత్తాన్ని చెక్కురూపంలో విరాళంగా ఇచ్చారు. సేవాసమితి ప్రధాన కార్యదర్శి జెట్టి శివరామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ దాత విరాళంతో మార్చురీ రూమ్ను నెలరోజుల్లో నిర్మించి, అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. బంధువులు ఎవరైనా మరణిస్తే, దూరప్రాంతాల్లోని కుటుంబ సభ్యులు వచ్చేవరకు భద్రపరిచేందుకు గుంటూరు, విజయవాడకు వెళ్లకుండా ఇక నుంచి తెనాలి మహాప్రస్థానంలోనే మార్చురీ రూంలో ఉంచేందుకు వెసులుబాటు కలుగుతుందని వివరించారు. తెనాలిలో తొలిసారిగా అందుబాటులోకి రానున్న మార్చురీ రూంకు వితరణ చేసిన దాతను అభినందించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు ఢాకా సాంబిరెడ్డి, కొత్త సుబ్రహ్మణ్యం, తుమ్మల బాపయ్యచౌదరి, బుజ్జి, శంకరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నటులకు స్ఫూర్తి ఎన్టీఆర్

ప్రముఖ సినీనటి భారతీ విష్ణువర్ధన్


భారతీ విష్ణువర్ధన్కు ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న ఎం.భరత్, తేజస్విని

తెనాలి: అభిమానుల ప్రేమకు సాటి ఏదీ లేదని ప్రముఖ సినీనటి భారతీ విష్ణువర్ధన్ అన్నారు. తన లాంటి ఎందరికో మహానటుడు ఎన్టీ రామారావు స్ఫూర్తి అని చెప్పారు. తెనాలిలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటరులో జరిగిన సభకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్ శతజయంతి చలనచిత్ర పురస్కారాన్ని భారతీ విష్ణువర్ధన్కు, ప్రముఖ మేకప్ కళాకారుడు పీతాంబరానికి ప్రదానం చేశారు. పీతాంబరం తరపున ఆయన తనయుడు, సుప్రసిద్ధ దర్శకుడు పి.వాసు పురస్కారాన్ని స్వీకరించారు. అనంతరం భారతీ విష్ణువర్ధన్ తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో, క్రీడలు, సంగీతం, నృత్యం అంటే ఆసక్తి కలిగిన తనను ఆర్టిస్టును చేసిన అమ్మానాన్నలేనని చెప్పారు. ప్రేక్షకుల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగినట్టు చెప్పారు. సినీ దర్శకుడు పి.వాసు మాట్లాడుతూ తన తండ్రి పీతాంబరంతో ఎన్టీఆర్కు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సినిమా తీసి నష్టపోయిన తన తండ్రితో ఎన్టీఆర్ మళ్లీ సినిమాలు చేసినందునే, తానీస్థాయిలో ఉండగలిగినట్టు చెప్పారు. కొండవీ ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయులు మాట్లాడుతూ, సినీరంగంలో మకుటం లేని మహారాజులా ఎన్టీఆర్ వెలిగారని, తెలుగు భాషకు ఆయన చేసిన సేవ ఎంతో గొప్పదిగా చెప్పారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్బాబు తన ప్రసంగంలో తెలుగు భాష ఉన్నంతవరకు ఎన్టీఆర్ చిరస్థాయిగా ఉంటారని చెప్పారు. ప్రముఖ సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ, అందం, అభినయంలో పోటీపడే మహానటి భారతి అన్నారు. కృష్ణుడు, రాముడు వంటి ఎన్టీఆర్ పౌరాణిక రూపాలన్నింటికీ శిల్పి పీతాంబరం అని చెప్పారు. తొలుత గీతం విద్యాసంస్థల అధినేత ఎం.భరత్, బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేశారు. యర్రాప్రగడ రామకృష్ణ సభాపరిచయంతో ఆరంభమైన సభలో నందమూరి యశ్వంత్, చెన్నపురి తెలుగు అకాడమీ ఎండీ తూమాటి సంజీవరావు, కన్నడ నటుడు అనురుద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీ రమణ, మలినేని ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ మలినేని పెరుమాళ్, పాటిబండ్ల జ్యోతి మాట్లాడారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి పసుపులేటి వెంకటరమణ హఠాన్మరణం


డాక్టర్ పసుపులేటి వెంకటరమణ (ఫైల్)

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ ఆయుర్వేద మానసిక వైద్యనిపుణుడు, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్ పసుపులేటి వెంకటరమణ (69) హఠాన్మరణం చెందారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో గుండెపోటుతో నందులపేటలోని తన నివాసంలో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైద్యవృత్తిలో కొనసాగుతూనే కళా, సేవారంగాల్లో పనిచేశారు వెంకటరమణ. లయన్స్ క్లబ్లో వివిధ పదవులు నిర్వర్తిస్తూ తన సేవలతో జిల్లా గవర్నర్గా ఎదిగారు. మిత్రులతో కలిసి శారద సాహిత్య వేదికలో పనిచేస్తూ ప్రసిద్ధ రచయిత శారద (ఎస్.నటరాజన్) సాహిత్యాన్ని వెలువరించారు. సాహితీ ప్రముఖులు బి.తిరుపతిరావు, జగాష్విలితో కలిసి కొంతకాలం 'సంతకాలు' పేరుతో పత్రికను తీసుకొచ్చారు. కొంతకాలంగా చదువరుల వేదిక, పుస్తకమిత్ర పేరుతో సాహిత్యసేవలో ఉన్నారు. టీబీ రోడ్డులోని తన కార్యాలయం ఎదుట గత 17 ఏళ్లుగా వేసవి చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. వెంకటరమణ మృతి వార్త తెలియగానే పట్టణానికి చెందిన పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

● వాసవీ.. నమోస్తుతే


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

స్థానిక బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం వాసవీ అమ్మవారి జన్మదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వాసవీ అమ్మవారిని లక్ష మల్లెపూలతో సుందరంగా అలంకరించారు. ఆర్యవైశ్య మహిళలు కుంకుమ పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

– తెనాలిటౌన్


ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న ఆర్యవైశ్య మహిళలు


లక్ష మల్లెపూలతో అమ్మవారికి అలంకరణ

అన్నమయ్య పాటల పోటీలు


పాటల పోటీల్లో గానం చేసిన చిన్నారి

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని గీతామందిరంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించారు. ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వయస్కులవారు 80 మంది ఈ పోటీల్లో పాల్గొని అన్నమయ్య గీతాలను ఆలపించారు. విజయవాడలోని ఘంటసాల సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందం న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీలో పాల్గొన్నవారిలో అందే తన్మయి, మువ్వా ప్రవస్తి, జాహ్నవి, హారిణి, మానస వీణ, శ్రీజ, అనిరుధ్, మేఘన, హిమబిందు తదితరులున్నారు. సంస్థ కన్వీనర్ కొండవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తన ప్రచారం నిమిత్తమే గత 11 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. అన్నమయ్య జయంతి రోజైన మే 7న తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. సంస్థ బాధ్యులు లక్కరాజు లక్ష్మణరావు, కొండవీ వసుంధర, భారతీదేవి, దేవానంద్, లక్కరాజు కనకదుర్గ, జి.యశస్విని, ఎస్.దేవి లలిత, ఎస్.శేషరావు, జి.శివజ్యోతి పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహించిన మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ జయశ్రీ

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని మెల్లెంపూడి గ్రామ సచివాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మోడరన్ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ క్యాంప్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఉచిత డెంటల్ కేర్ క్యాంప్కు విశేష స్పందన లభించిందని, 52 మందికి డెంటల్ సంబంధిత సమస్యలతో ఉన్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని అన్నారు. మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ జయశ్రీ మాట్లాడుతూ డెంటల్ సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని, ముందు తెలుసుకుని పరీక్షలు చేయించుకుంటే వంటి సమస్యలను అరికట్టవచ్చని అన్నారు. మనం ఏదైనా ఆహారం తినాలంటే దంతాలే ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి గ్రామ వికాస్ ప్రాజెక్ట్ చైర్మన్ చంద్రా ఓబులారెడ్డి, ప్రసాద్ రెడ్డి, శంకరశెట్టి రమేష్, ఆర్సిసి సభ్యులు రాజా రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి ఈదులమూడి శేఖర్, షేక్ సుల్తానా, మోడరన్ డెంటల్ కేర్ వైద్యులు డాక్టర్ హరిప్రియ పాల్గొన్నారు.

మత్స్యకారులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం


సులకపేటలో ఫిష్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యకారులను ప్రోత్సహించేందుకు ఫిష్ ఆంధ్ర మార్ట్ను సబ్సిడీలపై ఏర్పాటు చేస్తోందని వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అన్నారు. ఆదివారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని సులకపేటలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్ర మార్ట్ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ఉన్న అపారమైన మత్స్య సంపదను ఇక్కడే అమ్ముకునే విధంగా ప్రభుత్వం మత్స్యకారులకు అవకాశం కల్పించిందని చెప్పారు. ప్రతి ప్రాంతంలో చేపలు వ్యాపారం చేసుకునే ప్రతి ఒక్కరికి 75 శాతం సబ్సిడీ ఇచ్చి ఫిష్మార్ట్ను ఏర్పాటు చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్రాజు, యువజన నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, ఉండవల్లి సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్ సమన్వయకర్త అనిల్ పాల్గొన్నారు.

కనకపుట్టమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


కనకపుట్టమ్మ తల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులోని శ్రీ కనక పుట్టమ్మ తల్లి దేవస్థానంలో మాజీ వ్యవసాయ శాఖమంత్రి కన్నబాబు దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శంకరరావు ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించి మాజీ వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు దంపతులకు ఘన స్వాగతం పలికారు. పూజ కార్యక్రమాల అనంతరం వేద ఆశీర్వచనం చేసి దంపతులను సత్కరించారు. తదుపరి వైఎస్సార్ సీపీ పెదకొండూరు పార్టీ కన్వీనర్ బర్మా అర్జునరావు, నాయకులు కొండూరు శేషులు కన్నబాబుకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మలబంటి శ్రీరామమూర్తి, బెల్లకొండ శ్రీనివాసరావు, వి. శంకర్, గోపి, అశోక్, సాయి, రవి, బుల్లబ్బాయి, సుబ్బారావు పాల్గొన్నారు.